క్లుప్తంగా

మార్కండేయ మహర్షికి పూజలు



పద్మశాలీ భవన్‌లో మార్కండేయునికి పూజలు చేస్తున్న పద్మశాలీ సంఘ ప్రతినిధులు

తగరపువలస: పద్మశాలీయుల వంశ మూలపురుషుడు మార్కండేయ మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక పద్మశాలీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించారు. పద్మశాలీయుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొప్పల రమేష్, కోసూరు మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ, సంఘం గౌరవ అధ్యక్షుడు మాదాబత్తుల గురునాథ్, ఉపాధ్యక్షులు కోసూరు రాంబాబు, మాదాబత్తుల అప్పలరాజు, కోశాధికారి చింతల రుషి, సహాయ కార్యదర్శి మాదాబత్తుల త్రినాథ్, ప్రతినిధులు జోగ రాజారావు, మాదాబత్తుల శ్రీరాములు, కొప్పల కృష్ణ, గిడుతూరి మురళి, మొండి కృష్ణ, మోటూరి సత్యనారాయణ, ఏలూరు శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ప్రధానోపాధ్యాయుల సమస్యలు



ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సుధాకర్

మధురవాడ: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల క్యాలెండర్‌ను విశాఖలో ఆయన మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రొయ్య ఆదయ్య, గేదెల సన్యాసిరావు, సుదర్శన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మూడు వేల గొర్రెలకు టీకాలు



కాపులుప్పాడలో గొర్రెలకు ట్యాగ్‌లు వేస్తున్న తాళ్లవలస పశువైద్యుడు దినేష్‌కుమార్

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పశువైద్యశాల వైద్యుడు దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 3వేల గొర్రెలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు తెలిపారు. మంగళవారం ఆయన భీమిలి జోన్ 4వ వార్డు కాపులుప్పాడలో 300 గొర్రెలకు టీకాలతోపాటు ఇనాఫ్ ట్యాగ్‌లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ కారణాల వల్ల మేకలు, గొర్రెలకు టీకాలు వేయించలేని వారు రైతు భరోసా కేంద్రం, పశువైద్యశాలల సిబ్బందిని సంప్రదించి టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు యజ్ఞేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో సైబర్ మోసాలు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఐ.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ సాంకేతికత పెరిగే కొద్దీ టెక్ మోసాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఆర్థిక మోసాలు, బ్లాక్‌మెయిలింగ్ నేరాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే వీటిపై అవగాహన కలిగి ఉంటే నేరాలను అదుపు చేయవచ్చన్నారు. కళాశాల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, పరిపాలనాధికారి సంతోష్, అధ్యాపకులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను బతకనిద్దాం



ఆడపిల్లల ఆవశ్యకతను రంగవల్లుల ద్వారా తెలియజేసిన రాయపాలెం హైస్కూల్ విద్యార్థినులు



ఆకట్టుకున్న రంగవల్లిక



ర్యాలీ నిర్వహిస్తున్న బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస: జాతీయ బాలికల దినోత్సవాన్ని భీమిలి మండలం, జీవీఎంసీ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆడ పిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదివిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదాలతో ర్యాలీలు నిర్వహించారు. జీవీఎంసీ రాయపాలెం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయినులు కలిసి ఆడబిడ్డల ఆవశ్యకతను తెలిపే రంగవల్లులు తీర్చిదిద్దారు. బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ గరల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో 2008 నుంచి జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాలికా విద్యపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. భీమిలి మండలం చిప్పాడ హైస్కూల్‌లో బాలికల దినోత్సవం సందర్భంగా తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు శోభారాణి, సీతారామరాజు, సిబ్బంది రవిబాబు, ఇవాంజిల్, అరుణ, దేవి, కనకరత్నం, సన్యాసమ్మ, ప్రధానోపాధ్యాయుడు రేక అప్పారావు బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలికలు చదువుకుని విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలని కోరారు.

బాలికలు స్వీయ రక్షణ అలవర్చుకోవాలి

ఆనందపురం : బాలికలు స్వీయ రక్షణ అంశాలను నేర్చుకొని ముందుకు సాగాలని గర్ల్ చైల్డ్ డవలప్‌మెంట్ అధికారి కలేషాబేగం సూచించారు. మండలంలోని నేలేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలేషాబేగం మాట్లాడుతూ బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం పలు చట్టాలు అమలు పరుస్తోందని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. బాలికల విద్యా వ్యవస్థను ప్రభుత్వం పటిష్ట పరుస్తోందని వివరించారు. క్రమశిక్షణ అలవర్చుకొని ఉత్తమ స్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలేషాబేగం

చిన్నారులను వేధించొద్దు

కొమ్మాది: చిన్నారులను వేధించొద్దు.., చిట్టి చేతులకు పని చెప్పవద్దు... అంటూ తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఇక్కడి పాఠశాలలో ఉపాధ్యాయురాలు విజయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సచివాలయ మహిళా పోలీస్ చండీప్రియ, అడ్మిన్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటం ఉధృతం

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటం ఉధృతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు అన్నారు. మంగళవారం అంబేడ్కర్ కూడలిలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను నష్టాల సాకుతో అమ్మకానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కర్మాగారం పరిరక్షణకు రెండేళ్లుగా చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఈ నెల 30న విశాఖలో జరపనున్న కార్మిక గర్జనను జయప్రదం చేయాలని కోరారు. ఉక్కు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటుకు వందలాది మంది రైతులు ఇచ్చిన భూములు కోల్పోకుండా చూడాలన్నారు. ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్‌కే రెహమాన్, జిల్లా నాయకులు అల్లు బాబూరావు, ఎండీ బేగం, వి.సత్యనారాయణ, ఎస్.మురళి, కానూరి రాంబాబు, మావూరి వీర్రాజు, తూతిక సోమరాజు, అల్లం గోవిందరావు, నూలు ఆదినారాయణ, మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్య సాధనకు చెడు మార్గాలే అవరోధం

తగరపువలస: విద్యార్థులు సాధించాలనుకునే ఉన్నత లక్ష్యాలకు చేరుకునే క్రమంలో చెడు మార్గాలే అవరోధంగా నిలుస్తాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై సంగివలస అనిట్స్‌లో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు నెలల కాలంలో మాదక ద్రవ్యాలు లేని రాష్ట్రంగా చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సూచనలతో పటిష్టమైన నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలు, చెడు స్నేహాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమ మద్యం, ఇసుక రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం సమాచారాన్ని 14500 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, భీమిలి ఇన్‌స్పెక్టర్ వి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు ఆలకిస్తూ.. అభివృద్ధిని వివరిస్తూ..



లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొమ్మాది: మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తూ, మరోవైపు ప్రజా సమస్యలను ఆలకించి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెం, అంబేడ్కర్ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై నవరత్న పథకాల ద్వారా కలిగిన మేలు వివరించారు. నిత్యం ప్రజల కోసం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాలించడం మనందరి అదృష్టమన్నారు. సీఎం జగన్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. అటువంటి అభూత కల్పనలు, ఆరోపణలు నమ్మవద్దని, ప్రజల సంక్షేమం కోసం పని చేసే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా విధానం వల్ల ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సీఎం జగన్ మోహన్ రెడ్డికే సాధ్యమైందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం బోరవానిపాలెంలో గల సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతు, నాయకులు, కన్వీనర్లు ముచ్చు రామారావు, పోతిన సురేష్, బోయి సూరిరెడ్డి, బోయి శ్రీను, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, రోహిత్, భాగం సుధాకర్, చెరుకూరి రజని తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన తహసీల్దార్‌కు సన్మానం



లోకేశ్వరరావును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు తదితరులు

పద్మనాభం: పద్మనాభం తహసీల్దార్‌గా పని చేసి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన ఎం.వి.ఎస్.లోకేశ్వరరావును మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో లోకేశ్వరరావును ముందుగా ఎంపీపీ కంటుబోతు రాంబాబు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం డీలర్లు, వీఆర్వోలు, సిబ్బంది వేర్వేరుగా సన్మానించారు. హెచ్‌డీటీ కిశోర్ కుమార్, ఆర్‌ఐ కోటీశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం స్థానిక పశువైద్యుడు ఆర్.శ్రీనివాస్ విద్యార్థులకు జంతుహింస నిరోధక చట్టంపై అవగాహన కలిగించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా 32 మంది విద్యార్థులతో కైండ్‌నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. మూగజీవుల పట్ల ప్రేమగా ఉండాలన్నారు. అవసరం తీరిపోయాక వాటిని రోడ్లపై వదిలిపెట్టకూడదన్నారు. వన్యప్రాణులను వేటాడేవారికి జరిమానా, జైలుశిక్ష విధించవచ్చన్నారు. నోరులేని మూగజీవాలకు ఆహారం అందించి స్వేచ్ఛను ప్రసాదించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు బి.పైడిరాజు, ఉపాధ్యాయులు ఆర్.ఆశాలత, ఎం.పావని, బి.ఈశ్వరరావు, బి.గౌరీశంకర్, విజయలక్ష్మి, డీవీకే రాజు, ఆర్.వెంకటరమణ, పశుసంవర్ధక శాఖ సహాయకురాలు సరస్వతి, గోపాలమిత్ర రవి పాల్గొన్నారు.



విద్యార్థులతో పశువైద్యుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు

ఆటో ప్రయాణికుడి నగదు మాయం

తగరపువలస: టాటా మ్యాజిక్ వాహనంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తగరపువలస నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రయాణికుడు జీరు నరసింగరెడ్డి జేబు నుంచి రూ.14,500 మాయమయ్యాయి. చిట్టివలస గణేష్ థియేటర్ కూడలికి చెందిన బాధితుడు ఈ వాహనంలో డ్రైవర్ సీటు పక్కన కూర్చుని విశాఖ వెళ్లి జేబులో చూసుకోగా అందులోని రూ.30 వేలలో రూ.14,500 తక్కువ వున్నాయి. జేబులో నగదు మాయం కావడం పట్ల బాధితుడు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట శిబిరంపై దాడి

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ అల్లుపేట శివారులోని కళ్లాల వద్ద బహిరంగంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం రాత్రి 12.30 గంటల సమయంలో భీమిలి పోలీసులు దాడి చేశారు. శిబిరం వద్ద పది మంది ఆటగాళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,10,580 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వారిపై పెట్టీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఐ గంటా హరీష్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ఎమ్వీ రమణ, ఏఎస్‌ఐ నటరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

2030 నాటికి విద్యుత్ రంగం సుస్థిర వృద్ధి

కొమ్మాది: థర్మల్ విద్యుత్ ఉత్పాదనతోపాటు సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పాదనను మెరుగుపరచుకుంటూ 2030 నాటికి దేశ విద్యుత్ రంగం సుస్థిర వృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తుందని ఎన్‌టీపీసీ విశ్రాంత అధికారి పి.శివరామకృష్ణ అన్నారు. గీతంలో మెకానికల్ ఇంజినీరింగు విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న ఏడు సంవత్సరాల్లో శిలాజ ఇంధనాల ద్వారా విద్యుత్ ఉత్పాదన తగ్గించి సౌర, పవన విద్యుత్ ఉత్పాదనను 64.26 శాతం మేరకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు.

ఆటస్థలం అభివృద్ధికి దివీస్ సహకారం

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో యువత కోసం ఆటస్థలం తయారీకి చిప్పాడలోని దివీస్ లేబొరేటరీ రూ.80 వేలు కేటాయించింది. ఈ మేరకు మంగళవారం ఆటస్థలం అభివృద్ధి పనులను ఎంపీటీసీ సభ్యురాలు సురపతి దుర్గాలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మేరుగ ఎల్లాజీ ప్రారంభించారు. సంస్థ సీఎస్సార్ ప్రతినిధి ఇ.ఎస్.నాగరాజు, ఉప సర్పంచ్ సూకరాజు, వార్డు సభ్యులు అప్పారావు, ముసలయ్య పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

పద్మనాభం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని భీమునిపట్నం డైట్ లెక్చరర్ త్రినాథ్, పద్మనాభం ఎంఈవో శివరాణి అన్నారు. మండలంలోని గంధవరం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల నోట్ పుస్తకాలు ఎప్పటికప్పుడు దిద్దాలని, తప్పనిసరిగా హోం వర్కు ఇవ్వాలని సూచించారు. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

28 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి బంగారమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. విఘ్నేశ్వరుని పూజ, పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నామని, అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం



అంబేడ్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న దళిత సంఘ నాయకులు

భీమునిపట్నం: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మరో పది సంవత్సరాలపాటు పొడిగించడంతో మంగళవారం ఇక్కడి కుల వివక్ష పోరాట సమితి, దళిత సంఘ నాయకులు కీతిన్‌పేట సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కులవివక్ష పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి సీఎం జగన్ ఎన్నో మంచి పనులు చేస్తున్నారని కొనియాడారు. ఆయన వల్ల అందరికీ ఎన్నో విధాలుగా మేలు జరుగుతోందని, అందరం ఎంతో సంతోషంగా ఉన్నామన్నారు. ఇప్పుడు మరింత మేలు జరిగే విధంగా సబ్‌ప్లాన్ గడువును పొడగించడం చాలా గొప్ప విషయమన్నారు. గత ప్రభుత్వాల హయాంలో తమకు ఆశించిన విధంగా మేలు జరగలేదని, సీఎం జగన్ మాత్రమే మా ఇబ్బందులు, అవసరాలను గుర్తించి మంచి చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, భాగం గోపాలరావు, గంధవరపు కృష్ణ, ఎడ్ల రమేష్, కృష్ణవేణి, గౌరి, లక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు మేలు

తగరపువలస: బీసీ కార్పొరేషన్ల పదవీ కాలం పెంపుపై తగరపువలస పద్మశాలీ సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలియజేశారు. అనంతరం పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు అన్నివిధాలుగా మేలు చేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ తప్ప మరొకటి లేదన్నారు. టీడీపీ, జనసేన పూటకో వేషంతో ప్రజల విశ్వాసం కోల్పోయాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితోపాటు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. పద్మశాలీ సంఘం ప్రతినిధులు మాదాబత్తుల గురునాథ్, కొప్పల రమేష్, కోసూరి మురళి, కోసూరి రాంబాబు, మాదాబత్తుల శ్రీరాములు, మాదాబత్తుల అప్పలరాజు, జోగ రాజారావు, మొండి కృష్ణ, కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీరు మళ్లింపుతో మురుగు మాయం



సర్వీస్ రోడ్డు పైనుంచి చెరువులోకి వెళ్తున్న మురుగునీరు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలస చెరువునీటి అవుట్‌లెట్లు కాస్త సడలించడంతో రెండు అడుగుల మేర నీరు తగ్గింది. ఫలితంగా సర్వీస్‌రోడ్డుపై నిలిచిన మురుగు నీరు చెరువులోకి వెళ్లిపోయింది. సోమవారం భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో జీవీఎంసీ, ఇరిగేషన్, నేషనల్ హైవే అధికారులు సంగివలస చెరువుతోపాటు వాటి పరిసరాలను పరిశీలించారు. జాతీయ రహదారిపై మురుగునీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు చెరువు అవుట్‌లెట్ల ద్వారా నీటిని బయటకు పంపడంతోపాటు నేషనల్ హైవే నిర్మించిన డ్రైనేజీలను ఆధునికీకరించాలని సూచించారు. దీంతో సోమవారం నుంచే చెరువు నుంచి నీటిని పడమర, ఉత్తర దిశల నుంచి అవుట్‌లెట్ల ద్వారా మళ్లించారు. దీంతో చెరువునీరు వ్యవసాయ భూములకు, సర్వీస్ రోడ్డుపై మురుగు చెరువులోకి ప్రవహించడం ఏకకాలంలో జరిగిపోయాయి. ప్రస్తుతం సర్వీస్‌రోడ్డుపై మురుగునీరు దాదాపు తగ్గిపోయింది. ఇకపై కూడా చెరువు అవుట్‌లెట్ల ద్వారా నీటిని బయటకు సక్రమంగా పంపిస్తే వర్షం నీరు కూడా డ్రైనేజీల ద్వారా చెరువులోకి చేరిపోతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. అలాగే జీవీఎంసీతో సమన్వయం చేసుకుని నేషనల్ హైవే అధికారులు గతంలో అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీలను ఆధునికీకరించాలని కోరుతున్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్ గార్డ్స్



కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఓ యువకుడు మునిగిపోతుండగా లైఫ్‌గార్డ్స్ కాపాడారు. వివరాల్లోకి వెళ్తే... చత్తీస్‌ఘఢ్‌కు చెందిన ఐదుగురు యువకులు ఇక్కడి బీచ్‌లో సరదాగా గడిపేందుకు మంగళవారం సాయంత్రం వచ్చారు. కాసేపు తీరం వద్ద ఆడుకుని స్నానాలు చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో వారిలో అమిత్ కెరటాల తాకిడికి కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ వి.దేముడు, కె.రాజు, శ్రీనివాస్ అప్రమత్తమై యువకుడిని కాపాడారు. ప్రాణాపాయం తప్పడంతో స్నేహితులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రహదారుల వెంట మొక్కల పెంపకం

ఆనందపురం : అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు నిర్మించిన రహదారి వెంట మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ మార్గంలో ఇటీవల ఆరు లైన్ల రహదారి నిర్మించి రాకపోకలకు అనుమతిచ్చారు. రోడ్డు నిర్మాణ సమయంలో ఇరువైపులా గల పెద్ద పెద్ద వృక్షాలను తొలగించారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినా ఇరువైపులా బోసిపోయి దర్శనమిస్తున్నాయి. ఈ మేరకు రోడ్డు కాంట్రాక్టరు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆనందపురం జంక్షన్ నుంచి ఎడమ వైపు రోడ్డు అంచున మొక్కలు నాటుతున్నారు. 20 వేల మొక్కలు నాటి, సంరక్షించే బాధ్యత తీసుకుంటున్నామని కాంట్రాక్టర్ తెలిపారు. పశువులు, మేకలు తినేయకుండా గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలకు సత్కారం



విజేతలను అభినందిస్తున్న నాయకులు, అసోసియేషన్ సభ్యులు

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో గత నెలలో నెల్లూరులో నిర్వహించిన స్కై మార్షల్ ఆర్ట్స్‌లో విజేతలుగా నిలిచిన పలువురు విద్యార్థులను మంగళవారం శొంఠ్యాం హైస్కూల్‌లో సన్మానించారు. స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలంలోని గిడిజాల హైస్కూల్ నుంచి 11 మంది, శొంఠ్యాం నుంచి ఏడుగురు, ఆనందపురం నుంచి ఇద్దరు, గుడిలోవ నుంచి నలుగురు, జుత్తాడ నుంచి ఏడుగురు, పెందుర్తి నుంచి ముగ్గురు, మర్రిపాలెం నుంచి ముగ్గురు, మధురవాడ నుంచి ఇద్దరు చొప్పున రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వారికి వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, లెంక రాంబాబు, అసోసియేషన్ అధ్యక్షుడు ఆబోతు అప్పలరాము తదితరులు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యా కమిటీ చైర్మన్ బంగార్రాజు, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సురేష్ కుమార్, మేముసైతం సొసైటీ వ్యవస్థాపకుడు అక్కిరెడ్డి దేముడుబాబు, హెచ్‌ఎం కె.వి.సుబ్బారావు, షిణగం అప్పలరాజు, రౌతు శ్రీను, సంతోష్, రవి పాల్గొన్నారు.